క్లుప్తంగా

ఘనంగా రాహుకేతు పూజలు



రాహుకేతు పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంత రం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వారిచే భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో అధ్యక్షుడిగా అమరేంద్రనాయుడు



సింగిల్‌విండో ప్రెసిడెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అమరేంద్రనాయుడు

తవణంపల్లె: మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె సింగిల్‌విండో భవనంలో సోమవారం తవణంపల్లె సింగిల్‌విండో ప్రెసిడెంట్‌గా అమరేంద్రనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తరబ్రాహ్మణపల్లె సింగిల్‌విండో భవనంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. రైతు సంక్షేమం దృష్ట్యా సింగిల్‌విండో ద్వారా ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తామన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు కూడా పదవీ బాధ్యతలు చేపట్టారు.

అద్దె చెల్లించని దుకాణాలు సీజ్



తనిఖీ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్ సముదాయాల్లో అద్దెలు చెల్లించని రెండు దుకాణాలను అధికారులు సీజ్ చేశారు. నగరంలోని పలు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లో దీర్ఘకాలికంగా అద్దెలు చెల్లించకపోవడంపై చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఎంఎస్‌ఆర్ కూడలిలోని కార్పొరేషన్ దుకాణ సముదాయంలో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేశారు. అద్దెలు చెల్లించని రెండు దుకాణాలను సీజ్ చేశారు. పలు దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. వెంటనే బకాయిలు చెల్లించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ అధికారి గోపాలకృష్ణవర్మ, ఆర్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించండి

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆపై ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడని వినతులను తక్షణం పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా వేదికలోకి వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఈ గ్రీవెన్స్‌లో మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు

తవణంపల్లె: చౌకదుకాణాల డీలర్లు వికలాంగులకు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు విధిగా ఇంటి వద్దకే నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా చౌకదుకాణాలను తనిఖీ చేస్తామన్నారు. చౌకదుకాణాల దగ్గర నోటీసుబోర్డుతో పాటు ఫిర్యాదుల పెట్టె, ఫస్ట్‌ఎయిడ్ బ్యాక్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. డీలర్లు ప్రతి నెలా 18వ తేదీన తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని లేదంటే జరిమానా విధిస్తామన్నారు. డీలర్లు, రేషన్‌కార్డుదారులకు సకాలంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఆర్‌ఐ జీవన్‌సాగర్, డీలర్లు పాల్గొన్నారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

దోమకాటుతో జాగ్రత్త

గుడిపాల: దోమకాటు రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. సోమవారం బసవాపల్లె, వసంతాపురంలో గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దోమకాటు వల్ల సంభవించే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాధుల గురించి వారికి వివరించారు. దోమకాటు నుంచి రక్షణకు సాయంత్రం వేపాకు పొగ వేసుకోవడం, కిటికీలకు మెష్ బిగించుకోవడం ప్రతి వారానికి ఒకటికి రెండుసార్లు ఫ్రైడే, డ్రైడే పాటించడం, నీటి నిల్వలపై మూతలు ఏర్పాటు చేసుకోవాలని వారికి తెలియజేశారు.

గంతలు కట్టుకున్నారా ?

చిత్తూరు నగరంలోని సంతపేట చవటపల్లె రోడ్డు దుస్థితి , చిత్తూరు నగరంలోని 12వ డివిజన్ గోపాలపురం- వేలూరు వెళ్లే దారి







అధ్వానంగా చిత్తూరు మండలం పెరుమాళ్ల కండ్రిగకు వెళ్లే ప్రధాన రహదారి





చిత్తూరు నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా నగరంలోని మహావీర్ బ్రిడ్జి నుంచి వీధి వీధిలో రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. వీటిని బాగు చేయించడమనే సాకుతో.. కార్పొరేషన్ నిధులు నీళ్లలాగా ఖర్చు చేస్తున్నారు. కానీ గుంతలు పూడ్చిన ఆర్నెళ్లకే మళ్లీ అవే చోట గుంతలు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల కొత్త రోడ్లు వేసినా ఏడాది కూడా నిలబడని పరిస్థితి. ఇక గుడిపాల, చిత్తూరు మండలాల్లో అయితే పరిస్థితి దారుణంగా తయారైంది. వర్షం పడితే గ్రామాల్లోకి వెళ్లడానికి బురదనిండిన రోడ్లలో కాలు మోపాల్సిన పరిస్థితి. జాతీయ రహదారులు, ఆర్ అండ్‌బీ రోడ్లు కూడా నెర్రెలు వచ్చేసి, నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా అధికారులు నిత్యం ఇటువైపు తిరుగుతున్నా.. అవే గుంతల్లో వాహనాలు పోనిస్తున్నా కళ్లకు గంతలు కట్టుకుంటున్నారు తప్ప.. వాటిని బాగు చేయించడంలో మాత్రం శ్రద్ధ చూపించడం లేదు. నియోజకవర్గంలో రోడ్లు ఎలా ఉన్నాయో పరిశీలిస్తే ఇలా కనిపించాయి.

– చిత్తూరు అర్బన్



రోడ్డు వేసిన ఏడాదికే గుంతలు ఏర్పడిన చిత్తూరు గురునగర్ కాలనీ రోడ్డు

మోసం.. చంద్రబాబు నైజం



గుడిపాల: కూటమి వైఫల్యాలపై సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



క్యూఆర్ కోడ్ స్కానింగ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేసిన దాఖలాలు లేవు
- బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు

గుడిపాల: 'సీఎం చంద్రబాబు పాలనంతా అబద్ధాలు.. మోసాలే.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన దాఖలాలు లేవు.. ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. సోమవారం నారగల్లు, 197 రామాపురం, మరకాలకుప్పం, బొమ్మసముద్రంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ కూటమి వైఫల్యాలను వివరించారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. 2024 ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు, ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే.. వాటిని నిలిపివేశారన్నారు. వైఎస్సార్‌సీపీ పేదలకు అండగా నిలిస్తే.. కూటమి ప్రభుత్వం దగా చేసే ప్రభుత్వమని విమర్శించారు. సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వ పాలకులు నడిపిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ జయప్రియ బాబు, సర్పంచ్‌లు రజినీకాంత్, మోహన్, మధుసూదన్‌రాయల్, జనార్దన్, చిట్టి, ప్రసాద్, ప్రవీణ్, నాయకులు సంపత్, గుణ, నోయల్‌బాబు, మణికంఠన్, సుబ్రమణ్యం, శ్రీరాములు, రమేష్, వెంకటేష్, ఆనందన్, సూర్య, నవీన్, పెద్దన్న, బాబు, గంభీరం, వెంకటేశులు, రవిలతో పాటు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



పానాటూరులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత తెలిపారు. సోమవారం పానాటూరులో ఇంటింటికీ వైద్యసేవలు అందించారు. ముందుగా గర్భిణులకు రక్త పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు, దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బోర్లు, కొళాయిల ద్వారా ఫ్లోరిన్ నీరు వచ్చే అవకాశం ఉందని, వాటిని వేడి చేసుకుని చల్లారిన తరువాత తాగడానికి వాడాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలలో కాన్పు చేయించుకోవాలన్నారు. కాన్పు అనంతరం ప్రభుత్వ వాహనం ద్వారానే ఉచితంగా తల్లీబిడ్డను వారి గ్రామాలకు చేరుస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శశికళ, హైమావతి, రాధ, ప్రీతి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



బంగారుపాళెం: కొదలమడుగులో కృష్ణభగవానుడికి పూజలు చేస్తున్న భక్తులు



బంగారుపాళెం: శ్రీకృష్ణభగవానుడి గ్రామోత్సవం

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగు గ్రామంలో సోమవారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమంలో భాగంగా మూడో రోజు ఉదయం గ్రామానికి చెందిన ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణ భగవానుడి ప్రతిమను విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి పురవీధుల్లో మేళతాళాలు, కోలాట ప్రదర్శనల నడుమ కోలాహలంగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్, బాలాజీ, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మార్గదర్శి పాఠశాల పూర్వ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : 11 సంవత్సరాల తర్వాత నగరంలోని మార్గదర్శి స్కూల్ విద్యార్థులు సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనాన్ని అట్టహాసంగా జరుపుకున్నారు. విద్యార్థి దశలో తాము పాఠశాలలో వ్యవహరించిన తీరు, టీచర్ల తీసుకున్న శ్రద్ధను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించి ఆటపాటలతో సందడి చేశారు. నగరంలోని తోటపాళ్యంలో ఉండే మార్గదర్శి పాఠశాలలో 2013–14 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఒకచోట కలిశారు. తెలుగు ఉపాధ్యాయులు వెంకటేశన్ మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో స్థిరపడిన విద్యార్థులను అభినందించారు. పూర్వ విద్యార్థులు దిలీప్, లోకేష్, శరత్, వెంకటేష్ మాట్లాడుతూ నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈ రోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈఓ రామ్మూర్తి నాయుడు, మార్గదర్శి స్కూల్ కరస్పాండెంట్ సుధీర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటిలోపు అర్జీలు సమర్పించండి

గుడిపాల: అన్నదాత సుఖీభవకు సంబంధించి ఇంతవరకు నగదురాని రైతులు ఆయా రైతుసేవా కేంద్రాల్లో 20వ తేదీలోగా అర్జీలను అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు సమర్పించాలని వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గుడిపాల మండలంలో ఇంతవరకు అన్నదాత సుఖీభవ డబ్బులు రాని వారు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఇందులో భాగంగా గుడిపాల రైతుసేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పుష్పాంజలి ఫోన్ నంబర్ 7670925815, బొమ్మసముద్రం, పానాటూరు రైతుసేవా కేంద్రంలో వినయకుమార్–6303055584, మరకాలకుప్పం, నంగమంగళం కేంద్రంలో మధులత– 9014696817, పాపసముద్రం జ్యోష్ణ–9390775774, చిత్తపార సోనియా–8374946245, రామభద్రాపురం, 189 కొత్తపల్లె రైతుసేవా కేంద్రంలో భువనేశ్వరి – 8309040835, చీలాపల్లె, పేయనపల్లె శైలజ–6305002909, తిమ్మయ్యపల్లె, 197రామాపురంలో దీపక్–6300004782, నారగల్లు, ఏఎల్‌పురం లోకేష–9014455009, వసంతాపురం, బసవాపల్లె మోహన్‌బాబు–9866495331 నంబర్లలో సంప్రదించాలన్నారు. అర్హత ఉండి రాని వారు మాత్రమే అర్జీలు ఇవ్వాలని సూచించారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యం



తవణంపల్లె : వెలుగు కార్యాలయంలో మాట్లాడుతున్న ఏపీఓ బాల

తవణంపల్లె: సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ బాల తెలిపారు. సోమవారం వెలుగు కార్యాలయంలో వయోజన విద్య డిపార్టుమెంట్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఉల్లాస్– అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా, నిరక్షరాస్యత నిర్మూలించి వంద శాతం అక్షరాస్యత సాధించడానికి ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లు, సంఘమిత్రలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ మండలంలో 5 వేల మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో 2100 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రతి పది మంది నిరక్షరాస్యులకు ఒక వలంటీరును ఎంపిక చేసి ఆర్నెళ్ల పాటు సాయంత్రం 5 నుంచి 7 గంటలకు వారికి అక్షరాలు నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం నాగరత్న సంఘమిత్రలు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: ఉల్లాస్–అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా వంద శాతం అక్షరాస్యత సాధించే లక్ష్యంగా కొనసాగుతున్నామని ఏపీఎం ఈశ్వరి అన్నారు. సోమవారం ఆమె వెలుగు కార్యాలయంలో వయోజన విద్య పర్యవేక్షకుల ఆధ్వర్యంలో గుర్తించబడిన వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ ఆధ్వర్యంలో సంచార, అర్ధ సంచార విముక్త జాతుల విముక్తి దినోత్సవాన్ని ఈ నెల 30న విజయవాడలో నిర్వహించనున్నట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సంచార జాతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

21న సావిత్రమ్మ కళాశాలలో భూమిపూజ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21వ తేదీన భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మనోహర్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21వ తేదీన తమ కళాశాల ప్రాంగణంలో ఎన్‌పీ చెంగల్‌రాయనాయుడు బీసీ హాస్టల్ భవన్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఐరాల: కాణిపాకం ఫ్లైఓవర్‌పై తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. కాణిపాకంలో ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న భక్తుల భద్రత దృష్ట్యా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను ఎత్తు పెంచడానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

రైతులకు కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు

గుడిపాల: రైతులకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గతంలో రీసర్వే జరిగిన రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన రైతులకు పుస్తకాలు వచ్చాయన్నారు. 13 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 4,552 పుస్తకాలు వచ్చాయన్నారు. ఇందులో మొగరాళ్లపల్లె 752, కృష్ణజమ్మాపురం 52, లక్ష్మాంబపురం 10, నంగమంగళం 526, పశుమంద 179, వసంతాపురం 326, మరకాలకుప్పం 352, డీబీపల్లె 490, ముట్టుకూరుపల్లె 96, పాపసముద్రం 589, కుప్పిగానిపల్లె 471, చిత్తపార 724, బండపల్లె 39 మంది రైతులకు పాస్ పుస్తకాలు వచ్చాయన్నారు. వీటన్నింటిని ఆయా వీఆర్‌ఓల ద్వారా రైతులకు అందజేస్తామన్నారు.

414 పింఛన్ల తొలగింపు

తవణంపల్లె: ప్రభుత్వం మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 414 దివ్యాంగుల పింఛన్లను తొలగించినట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. తొలగించిన పింఛన్ల లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని ఎగువ తవణంపల్లె సచివాలయంలో 26, అరగొండలో 19, పైమాఘంలో 22, చెర్లోపల్లెలో 14, టి.పుత్తూరులో 36, జొన్నగురకలలో 35, గోవిందరెడ్డిపల్లెలో 22, సరకల్లులో 17, మల్లకుంటలో 15, మత్యంలో 36, నలిశెట్టిపల్లెలో 49, పల్లె చెరువులో 14, పట్నంలో 26, పుణ్యసముద్రంలో 17, తవణంపల్లెలో 21, వెంగంపల్లె సచివాలయంలో 28 దివ్యాంగుల పింఛన్లు తొలగించడానికి లబ్ధిదారులకు నోటీసులు అందించినట్లు వివరించారు.

గోసంరక్షణకు రూ.లక్ష విరాళం

చిత్తూరు రూరల్(కాణిపాకం): కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు సోమవారం ఓ దాత నగదు విరాళం చేశారు. గుంటూరుకు చెందిన దాత సీహెచ్‌వీకే రామ్మూర్తి ట్రస్టుకు రూ.లక్ష నగదును ఆలయ సిబ్బంది కోదండపాణి, చిట్టిబాబుకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చలించి..ఆర్థిక సాయం అందించి..



ఆర్థిక సహాయం చెక్కు అందజేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : మానవతా దృక్పథంతో కలెక్టర్ తన సొంత నిధులు రూ.లక్ష ఆర్థిక సహాయంగా అందించారు. జిల్లాలోని యాదమరి మండలం ముస్లింవాడ 14 కండ్రిగకు చెందిన మునిరా అనే వ్యక్తికి రెండేళ్ల క్రితం మందురాయి పనిలో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తన రెండు కళ్లు, కుడి చేయి మణికట్టు వరకు తెగిపోయింది. పుట్టుకతో మూగవాడు అయిన మునిరాకు ఎలాంటి జీవనాధారం లేకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఆ బాధితుడు, ఆయన భార్య ఇంతియాజ్ బేగం, ఇద్దరు పిల్లలు కలిసి ఆర్థిక సహాయం చేయాలని సోమవారం పీజీఆర్‌ఎస్‌లో విజ్ఞప్తి చేశారు. బాధితుడి పరిస్థితిని చూసి కలెక్టర్ చలించిపోయారు. వెంటనే తన సొంత నిధులు రూ.లక్ష బాధితుడి కుటుంబానికి తన వంతు సాయంగా చెక్కు అందజేశారు.

పార్కింగ్ పంచాయితీ



బస్టాండులో డిపో-2 అధికారులు పెట్టిన బోర్డు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు ఆర్టీసీ బస్టాండులోని తిరుపతి పాయింట్‌లో 2వ డిపో అధికారులు ఈ పార్కింగ్ పాయింట్ తమేదనంటూ బోర్డు పాతారు. కొన్ని రోజులుగా చిత్తూరు 1, 2 డిపో మధ్య పోరు నడిచింది. తిరుపతి పాయింట్‌లోని 1, 2 ప్లాట్‌ఫామ్‌లో తమ వాహనమే పార్కింగ్ చేయాలని ఇరు డిపోల అధికారులు, కార్మికులు పట్టుబట్టారు. రెండు డిపోల బస్సులు మొదటి ప్లాట్‌ఫామ్‌లో పార్కింగ్ చేయాలని పోటీ పడడంతో రాసుకున్నాయి. రెండు బస్సులు వెనుకభాగంలో రాసుకున్నాయి. ఇది పెద్దదుమారమే రేపింది. జిల్లా, జోనల్‌స్థాయి అధికారుల వరకు పంచాయితీ నడిచింది. చివరికి డిపో 2 అధికారులు ఆ పాయింట్ తమదేనంటూ బోర్డు పెట్టారు. దీనిపై కొంతమంది మండిపడుతున్నారు.